ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శుక్రవారం 20 జూన్ 2025

చినుకు జాడేది..?

● ఊరిస్తున్న మేఘాలు
● వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతన్నలు
● వేసవిని తలపిస్తున్న వాతావరణం



సుల్తానాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మేఘాలు వర్షించడం లేదు... వానాకాలం సాగుకు సమాయత్తం అవుతున్న రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు... మరోవైపు మబ్బులు కమ్ముకోవడంతో ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వర్షాల కోసం రైతులు, ప్రజలు ఎదురుచూస్తున్నారు. వర్షాలు కురవాలని ప్రజలు, రైతులు కప్పతల్లి ఆటలు, ఆలయాల్లో జలాభిషేకాలు చేస్తున్నారు.

వానాకాలం వ్యవసాయ సీజన్ పనులకు వరుణుడు కరుణించడం లేదు. ఇప్పటికే ఓ మోస్తారు వర్షాలు కురువాల్సి ఉండగా వానల ఊసే లేకుండా పోయింది. ఎండలు మండి పోతుండడంతో ప్రజలు ఉక్కపోతతో తల్లడిల్లిపోతున్నారు. రైతులు చినుకు కోసం ఎదురుచూస్తున్నారు. కొన్ని రోజులుగా మేఘాలు ఊరిస్తున్నాయే తప్ప చినుకురాలడం లేదు. అక్కడక్కడా రెండు మూడు చినుకులు పడి ఇక చాలన్నట్లుగా ముఖం చాటేస్తున్నాయి. దీంతో రైతుల్లో తీవ్ర నిరాశ నెలకొంది. వానలు ఎప్పుడు పడుతాయో, సాగు పనులు ఎపుడు ప్రారంభం చేయాలన్న సందిగ్ధంలో రైతులు ఉన్నారు. జూన్ మాసం వానాకాలం సీజన్‌లో వర్షాలు కురుస్తాయి.

ఈ ఏడాది మేలో వర్షాలు కురిసాయి. యాసంగి సీజన్‌లో పండించిన దాన్యాన్ని రైతులు ఆయా సమీప గ్రామాలలోని కొనుగోలు కేంద్రాలలో విక్రయానికి ఉంచగా వర్షాలతో ధాన్యం తడిసి పోయింది. ఎలాగో కొనుగోలు తతంగం ముగిసినా ఇక వానాకాలం సాగు పనులు ఆరంభం కావాల్సిన పరిస్థితుల్లో వానలు జాడ లేకుండా పోయాయి. పొలం పనుల కోసం రైతులు వారి కుటుంబ సభ్యులంతా సిద్ధంగా ఉన్నారు. విత్తనాలు ఎరువులు అందుబాటులో ఉన్నా వానలు కురువక పనులు ఎక్కడిక్కడే ఆగిపోయాయి. ఇప్పటికైనా వాన దేవుడు కరుణించాలని రైతులు వేడుకుంటున్నారు.

వర్షాలు కురవాలని కప్పతల్లి ఆట, జలాభిషేకాలు



రేగడిమద్దికుంటలో జలాభిషేకాలు, కప్పతల్లి ఆటలు

వరుణుడి కరుణ కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. వర్షాలు కురవాలని గురువారం పలు గ్రామాలలలో కప్పతల్లి ఆటలకు శ్రీకారం చుట్టారు. మండలంలోని రేగడి మద్దికుంట గ్రామంలో రైతులు కప్పతల్లి ఆటలు ఆడుతు వాటికి పెళ్ళిళ్ళు జరిపించారు. గ్రామంలోని గ్రామ దేవతలతో సహా ప్రధాన ఆలయాలలో స్వామి వార్లకు జలాభిషేకాలు నిర్వహించారు. బావులు బోరింగుల నుంచి బిందెలలో నీళ్ళు తీసుకువచ్చి ఆలయాలలో వరుణుడు కరుణించాలని పూజలు చేశారు. సింగిల్ విండో చైర్మన్ గడ్డం మహిపాల్ రెడ్డి, దేవుని రాజయ్య, బొజ్జ నది, చిక్కుడు రాజయ్య, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

- రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు ఎం చందన



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు చందన

పెద్దపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టాలని, వచ్చే ఏడాది మార్చి నాటికి బాల్య వివాహాల రహిత జిల్లాగా అధికారులు కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు చందన తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాలను నివారించేందుకు అధికారులు కృషి చేస్తున్నారన్నారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టం పకడ్బందీగా అమలు చేయాలని, స్కానింగ్ సెంటర్ల పై నిఘా పెట్టాలని ఆదేశించారు. బాలల హక్కులపై పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను అధికారులు తనిఖీ చేయాలన్నారు. బాల కార్మికులను గుర్తించి పునరావాసం కల్పించాలని అన్నారు. పిల్లలు భిక్షాటనలో ఉండకుండా చూడాలన్నారు. చిన్న పిల్లలకు అనారోగ్య సమస్యలు ఉన్నవారికి అవసరమైన శస్త్ర చికిత్సలు పూర్తి చేయడం, వినికిడి లోపం ఉన్న పిల్లలకు యంత్రాలు అందించాలన్నారు. అనాథ పిల్లలు, సెమీఅర్బన్ పిల్లల వివరాలు సేకరించి ప్రవేశ పరీక్ష లేకుండా గురుకులాలో చేర్పించామని అధికారులు తెలిపారు. డీసీపీ కరుణాకర్, జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్‌రావు, డీఎంహెచ్‌వో అన్న ప్రసన్న కుమారి, ఏసీపీలు కృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

పెద్దపల్లి కల్చరల్, (ఆంధ్రజ్యోతి): పిల్లల ఎదుగుదలలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తాయని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు చందన తెలిపారు, 8వ వార్డులో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు ఎగ్ బిర్యానీ పంపిణీని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పిల్లలకు ప్రీ స్కూల్ విద్య పోషకాహారం, ఆరోగ్య సంరక్షణలో సేవలందిస్తూ విద్య, సామాజిక అభివృద్ధిలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయన్నారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి వేణుగోపాల్, సీడీపీఓ కవిత, సూపర్‌వైజర్ ప్రేమలత, టీచర్లు స్వరూప, రేఖ, రజిత, సుజాత పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా జడ్జి స్వప్నరాణి

సుల్తానాబాద్, జూన్ 19: (ఆంధ్రజ్యోతి): సమాజంలో నేరాలు తగ్గాలంటే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా జడ్జి స్వప్నరాణి అన్నారు. నీరుకుళ్ళలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. జడ్జి మాట్లాడుతు యువత చెడు వ్యసనాలకు లోనవుతూ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. మహిళలు లైంగిక, వరకట్న వేధింపులకు బలవుతున్నారని ఇలాంటి నేరాలకు చట్టపరంగా కఠినంగా శిక్షలు ఉంటాయన్నారు. నిరుపేదలు దరఖాస్తు చేసుకుంటే న్యాయ సేవాధికారిక సంస్థ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటామని జడ్జి వివరించారు. ఫ్రీ లీగల్ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులను పోషించలేని కొడుకుల వివరాలతో సమీప రెవెన్యూ డివిజనల్ అధికారికి ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. తల్లిదండ్రులను పోషించలేని వారి భూముల పట్టాను రద్దు చేసే అధికారం ఉందన్నారు. న్యాయవాదులు శరత్ కుమార్, భాను, కృష్ణ, ఝాన్సీ గ్రామ స్పెషల్ అధికారి సచిన్, కార్యదర్శి సునిత గ్రామస్తులు పాల్గొన్నారు

ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన



నిబంధనలు పాటిస్తున్న వారికి పూలు ఇస్తున్న విద్యార్థులు

జ్యోతినగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన ఉండాలని ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్‌కిరణ్ అన్నారు. గురువారం ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డు వద్ద విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ తెలుసుకున్న విషయాలను తల్లిదండ్రులకు చెప్పి వారిని చైతన్యవంతుల్ని చేయాలన్నారు. హెల్మెట్ ధరించేలా, కారు సీట్ బెల్టు పెట్టుకునేలా విద్యార్థులు చూడాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపవద్దన్నారు. ఏఎస్ఐ నాయుడు, సిబ్బంది, టీటీఎస్ జెడ్పీ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు అంజన్ కుమార్, తిరుపతి పాల్గొన్నారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలపై కాకతీయ హైస్కూల్ విద్యార్థులకు పోలీసులు గురువారం అవగాహన కల్పించారు. అంబేద్కర్ చౌరస్తాలో వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్, ఆర్‌సీ, మైనర్ల డ్రైవింగ్‌పై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తున్న వారికి విద్యార్థులతో పూలు ఇప్పించి అభినందించారు. ఎస్ఐ రమేష్, కాకతీయ హైస్కూల్ ప్రిన్సిపాల్ ప్రదీప్‌రెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

రేపు అంతర్జాతీయ యోగా దినోత్సవం

పెద్దపల్లి కల్చరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈనెల 21న జిల్లాలో అధికారికంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ఉదయం 7.30 గంటలకు ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో కూనారం రోడ్డులోని ఆర్‌కే గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో కార్య క్రమం నిర్వహిస్తున్నామని, యువత, మహిళలు, ఉద్యోగులు, కళాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

లెస్ టెండర్లు వేస్తే చర్యలు

కోల్‌సిటీ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి అంచనా వ్యయంపై 25శాతం కన్నా తక్కువ క్రోడీకరణ చేస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ అరుణశ్రీ హెచ్చరించారు. లెస్ టెండర్లు వేసినట్లయితే థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్‌కు తోడు ఇంజనీరింగ్‌శాఖ అధికారులతో పరీక్షలు నిర్వహించి నాణ్యత నిర్ధారించుకున్న తరువాత బిల్లులు చెల్లిస్తామని, ఈ షరతును కాంట్రాక్టు అగ్రిమెంట్‌లో కూడా జతచేస్తామన్నారు. అభివృద్ధి పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని, లేకపోతే కాంట్రాక్టర్లకు బిల్లులు నిలిపివేస్తామని ఆమె హెచ్చరించారు.

కౌలు రైతులను ఆదుకోరూ..

● ఎన్నికల సమయంలో భరోసా ఇస్తామని హామీ
● ఏడాదిన్నర గడిచినా పట్టించుకోని ప్రభుత్వం
● యేటా పెరుగుతున్న పెట్టుబడులు
● గిట్టుబాటు కాని సాగు
● ఇప్పటి వరకు మార్గదర్శకాలను రూపొందించని ప్రభుత్వం



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

కౌలు రైతులను ఆదుకునేందుకు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రైతుభరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయాన్ని అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వారి గురించి పట్టించుకోవడం లేదు. ఏడాదిన్నర గడిచినా కూడా వారి ఊసెత్తడం లేదు. గత ప్రభుత్వం వ్యవహరించినట్లుగానే ప్రస్తుతం ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయమే జీవనాధారంగా జీవించే కొందరు రైతులు తమకున్న భూమితోపాటు మరికొందరి పట్టాదారుల భూములను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తుంటారు. ఎలాంటి భూములు లేని కొందరు రైతులు కూడా భూములను కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నారు. ఆరుగాలం శ్రమించి చెమటోడ్చి పంటలు సాగు చేస్తున్న కౌలు రైతులకు కూలీ కూడా గిట్టుబాటు కావడం లేదు. ప్రకృతి వైపరీత్యాలు వస్తే అంతే సంగ తులు. కష్టమంతా పట్టాదారుల చేతిలో పెట్టాల్సిందే. యేటా పెరుగుతున్న పంట పెట్టుబడులు, కౌలు ధరలతో కౌలు రైతులు కుదేలవుతున్నారు.

పంట రుణాలకు, రైతు బీమాకు, పంటల బీమాకు, సబ్సిడీ పథకాలకు కౌలు రైతులు నోచుకోవడం లేదు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగినా కూడా పరిహారం ప్రభుత్వం పట్టాదారులకే ఇస్తున్నది. ప్రభుత్వ సాయం అందక పంట నష్టాలు వచ్చి పెట్టిన పెట్టుబడులు దక్కక అనేక మంది రైతులు అప్పుల పాలవుతున్నారు. ఆ అప్పులు తీర్చే దారి లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ విషయాలపై అధ్యయనం చేసిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా కౌలు రైతులకు కూడా రైతు భరోసా పథకాన్ని వర్తింపజేస్తామని ప్రకటించింది. కానీ ఇప్పటి వరకు అమలుకు నోచుకోకపోవడంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

రైతుభరోసా ఇస్తామని ప్రభుత్వ హామీ..

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను తీసుకు వచ్చింది. తమను గెలిపిస్తే ఆ పథకాలను అమలు చేస్తామని విస్తృతంగా ప్రచారం చేసింది. అందులో భాగంగా రైతులకు 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేస్తామని, రైతు భరోసా పథకం కింద రైతులకు, కౌలు రైతులకు ఎకరానికి 7,500 రూపాయల చొప్పున ఏడాదికి 15 వేల రూపాయలు ఇస్తామని, రైతు కూలీలకు ఏడాదికి 12 వేల రూపాయలు ఇస్తామని ప్రకటించింది. మొదట 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేసిన ప్రభుత్వం గడిచిన మిగతా 8వ పేజీలో

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి : కలెక్టర్



పెద్దపల్లి ఆసుపత్రి ఆవరణలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. గురువారం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లో అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. జడ్పీహెచ్ఎస్ రామగుండం పాఠశాలకు 40 లక్షల సీఎస్ఆర్ నిధులు అందుబాటులో ఉన్నాయని, వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. పాఠశాల అభివృద్ధి పనులకు ఎస్ఎంసీ (స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ) తీర్మానాలు తీసుకోవాలన్నారు. జిల్లాలో జూనియర్ కళాశాల అభివృద్ధి పనులకు నిధులు అందుబాటులో ఉన్నందున పనులు వారం రోజులలో ప్రారంభం కావాలన్నారు. పెద్దపల్లి ఆసుపత్రి భవన నిర్మాణ పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అన్నారు. గోదావరిఖని జనరల్ ఆసుపత్రి మొదటి అంతస్తు మరమ్మతు పనులు పూర్తి చేసి ఆసుపత్రికి అప్పగించినట్లు సర్టిఫికెట్ సమర్పిస్తే బిల్లుల చెల్లింపులు పూర్తి చేస్తామన్నారు. జీజీహెచ్ గ్రౌండ్ ఫ్లోర్‌లో 98 లక్షలతో మరమ్మతు పనులు, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన పనులు ప్రతిపాదనలు పక్కాగా సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లలో మరమ్మతు పనుల పురోగతి వివరాలను తెలుసుకున్న కలెక్టర్ వాటిని సత్వరమే పూర్తి చేయాలన్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు

పెద్దపల్లిటౌన్, (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డయేరియా నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. 5 సం వత్సరాల లోపు పిల్లలకు డయేరియా నియంత్రణ పై తీసుకునే చర్యల గురించి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని పాఠ శాలలు, అంగన్వాడి కేంద్రాలలో పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. పారిశుధ్య నిర్వహణను ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ పారిశుధ్య కమిటీలలో వైద్య శాఖ సిబ్బంది భాగస్వామ్యం చేయాలన్నారు. ఆశా కార్యకర్తల దగ్గర అవసరమైన మేర ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలన్నారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో ఒకరు అనారోగ్యానికి గురైతే మిగిలిన పిల్లలకు త్వరగా వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. అధికారులు వారి పరిధిలో ఉన్న హాస్టల్స్‌ను విజిట్ చేయాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, గ్రామాలలో రెగ్యులర్‌గా ఫాగ్గింగ్ చేయాలని సూచించారు. రామగుండం ప్రాంతంలో అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమర్థవంతంగా వైద్య సేవలు అందించాలన్నారు. క్రిటికల్ కేసులను గోదావరిఖని జనరల్ ఆసుపత్రికి రిఫర్ చేయాలన్నారు. అనుమతి లేకుండా వైద్యులు, నర్సు, ఏఎన్ఎం గైర్హాజరు కావద్దన్నారు. వైద్యశాఖ అధికారులు సంస్థల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు

గోదావరిఖని, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాల రక్షణ, ఉద్యోగ భద్రత, ఉపాధి హక్కుల సాధన, కనీస వేతనాలు రూ.26వేల వరకు పెంపు తదితర డిమాండ్‌లతో జూలై 9న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సింగరేణి కార్మిక సంఘాల ఐక్య వేదిక కార్మిక వర్గాన్ని కోరింది. గురువారం హెచ్ఎంఎస్ కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జీ రాములు, టీఎన్‌టీయూ రాష్ట్ర నాయకులు ఏడుకొండలు సమావేశంలో పాల్గొన్నారు. సమ్మెలో సంఘటిత, అసంఘటిత కార్మిక వర్గం పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమ్మెను విజయవంతం చేసేందుకు కార్యాచరణ ప్రకటించారు. ఈ నెల 23 నుంచి 30వరకు అన్ని డివిజన్లలో ప్రెస్‌మీట్లు, జూలై 1 నుంచి 7వరకు సింగరేణి వ్యాప్తంగా గేట్ మీటింగ్‌లు, యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇవ్వాలని తీర్మానించారు. నారాయణ, నరేష్, రాజేశం, నిరంజన్ పాల్గొన్నారు.

రామగుండంలో డివిజన్ల పునర్విభజన పూర్తి

● పలు డివిజన్లలో మారిన స్వరూపాలు
● రెండు డివిజన్లుగా గౌతమినగర్

కోల్‌సిటీ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థలో డివిజన్ల పునర్విభజన పూర్తయింది. గురువారం డివిజన్ పునర్విభజన ప్రక్రియను పూర్తి చేసిన యంత్రాంగం కలెక్టర్ ద్వారా మున్సిపల్ డైరెక్టర్‌కు నివేదించింది. పునర్విభజన సంబంధించి డ్రాఫ్ట్‌లో అనేక అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. డ్రాఫ్ట్ సందర్భంగా కేవలం ఎలక్టోల్ బ్లాక్‌లను తీసుకొని విభజన చేయడంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తాయి. దీంతో క్షేత్రస్థాయి ఓట్ల ఆధారంగా డివిజన్లను పునర్విభజించారు. లింగాపూర్, పాత రామగుండం, ఎల్కలపెల్లి గేటు, వీర్లపల్లి గ్రామాలు పునర్విభజనపై ప్రభావం చూపాయి. ఎలకలపల్లి గేట్ కార్పొరేషన్‌లో విలీనం కావడంతో దీని ప్రభావం మూడు డివిజన్‌లపై పడింది. వీర్లపల్లి గ్రామాన్ని మొదట మారేడుపాకలో విలీనం చేయాలని ప్రతిపాదించారు. వీర్లపల్లి, లక్ష్మీపురం గ్రామంలోని కొంత భాగాన్ని కలిపి ప్రత్యేక డివిజన్‌గా ఏర్పాటు చేశారు. ఎల్కలపల్లి గేట్, చైతన్యపురికాలనీ, ఆర్ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్, గౌతమీనగర్ ప్రాంతాన్ని ఒక డివిజన్‌గా ఏర్పాటు చేయగా, గౌతమీనగర్, శాంతినగర్, మాతంగి కాలనీ మరో డివిజన్‌గా ఏర్పాటు చేశారు. ఎన్టీపీసీ టౌన్ షిప్‌నకు ఖాజిపల్లిని జోడించారు. వెంకట్రావుపల్లె ప్రత్యేక డివిజన్‌గా ఏర్పాటు చేశారు. సింగరేణి క్వార్టర్‌లు ఉన్న ప్రాంతాలను డివిజన్లుగా ఏర్పాటు చేశారు. ఐబి కాలనీ, పవర్ హౌజ్ కాలనీ, జీఎం కాలనీ కలిపి ఒక ప్రత్యేక డివిజన్‌గా ఏర్పాటు చేశారు. లింగాపూర్‌కు హౌసింగ్ బోర్డును కలిపారు. పాత రామగుండంతోపాటు పాములపేట్, రామగుండం పట్టణంలోని కొంత ప్రాంతాన్ని ప్రత్యేక డివిజన్‌గా ఏర్పాటు చేశారు. మొత్తంగా డివిజన్ల పునర్విభజన పూర్తయి గురువారం మున్సిపల్ డైరెక్టర్‌కు నివేదించారు. శనివారం మున్సిపల్ డైరెక్టర్ ఆమోదం తర్వాత డివిజన్ల పునర్విభజనకు సంబంధించి ఫైనల్ నోటిఫికేషన్ విడుదల కానుంది.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



అంతర్గాం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్

అంతర్గాం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే తెలంగాణా ప్రభుత్వ ధ్యేయమని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాగూర్ అన్నారు. గురువారం ఆయా గ్రామాలకు చెందిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు, కొత్త రేషన్ కార్డులు, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు పాటు ప్రజలను వంచించి పాలించిందే కానీ ఇళ్లలేని పేదలకు సొంతింటి కలను నెరవేర్చలేదని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడంతో పాటు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నదని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా రైతులకు ఏక కాలంలో రెండు లక్షల రుణ మాఫీ చేసి ఎలాంటి కోతలు లేకుండా చివరి గింజ వరకు మద్దతు ధర ఇచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేసిందని తెలిపారు. అంతర్గాంలో 33కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆర్‌డీఓ గంగయ్య, తహసీల్దార్ తూము రవీందర్ పటేల్, ఎంపీడీఓ వేణు మాధవ్, సీఐ ప్రవీణ్ కుమార్, నాయకులు మడ్డి తిరుపతి గౌడ్, రాజలింగం, పెండ్యాల మహేష్, హనుమాన్‌రెడ్డి, సింగం కిరణ్ గౌడ్, ఆవుల గోపాల్ యాదవ్, నాజీయా సుల్తానా, పాల్గొన్నారు.

తడి ఆరని కన్నీటి ధార..

● ఐదు దశాబ్దాలుగా అంతర్గాం కాందిశీకుల ఆర్తనాదాలు
● ఏళ్లు గడిచినా పరిష్కారానికి నోచుకోని సమస్యలు 6

మద్యం మత్తులో బైక్‌కు నిప్పంటించిన యువకుడు



దగ్ధమవుతున్న బైక్

మల్యాల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం రాజారంలో మద్యం మత్తులో ఓ వ్యక్తి గురువారం తన ద్విచక్రవాహనాన్ని దహనం చేశాడు. జగిత్యాల మండలం టీఆర్‌నగర్‌కు చెందిన కలీం అనే వ్యక్తి రాజారంలోని హనుమాన్ ఆలయం వద్ద తన పల్సర్ వాహనాన్ని స్టార్ట్ చేయడానికి ప్రయత్నించాడు. అది స్టార్ట్ కాకపోవడంతో మద్యం మత్తులో ఉన్న అతడు దానికి నిప్పటించాడు. దీంతో మంటలు చెలరేగగా స్థానికులు జగిత్యాలలోని ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. వాహనం పూర్తిగా దగ్ధం అయినట్లు స్థానికులు తెలిపారు.

చిన్నబోనాల శివారులో చిరుత సంచారం..

● పాదముద్రలను గుర్తించిన రైతులు



చిన్నబోనాల శివారులోని పొలంలో చిరుత అడుగులు

సిరిసిల్ల రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లఅర్బన్ పరిధిలోని చిన్నబోనాల గ్రామశివారులోని వ్యవసాయ పొలాల్లో చిరుతపులి సంచరిస్తుండడంతో రైతులు భయంతో వణికిపోతున్నారు. చిన్నబోనాల గ్రామ శివారులోని సుద్దగండి ప్రాంతంలోని వ్యవసాయపొలాల్లో గురువారం తెల్లవారుజామున చిరుతపులి పాదముద్రలను రైతులు గుర్తించారు. ఈ విషయాన్ని రైతులు తాజా మాజీ కౌన్సిలర్ బోల్లం నాగరాజుగౌడ్ దృష్టికి తీసుకరావడంతో అక్కడివెళ్లి పరిశీలించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ అధికారులు అక్కడివెళ్లి అడుగులను పరిశీలించి చిరుతపులి అడుగులుగా గుర్తించారు. రాత్రిపూట రైతులు వ్యవసాయ పొలాల వైపు వెళ్లవద్దని అటవీశాఖ అధికారులు కోరారు. ఎలాగైనా చిరుతను పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

శంకరపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళఅదృశ్యంపై కేశవపట్నం పోలీస్ స్టేషన్లో కేసునమోదైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామానికి చెందిన బొంతల లావణ్య ఈ నెల10న ఇంటినుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. లావణ్య భర్త రాజు చుట్టు పక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఎలాంటి ఆచూకీ దొరకలేదు. దీంతో రాజు కేశవపట్నం పోలీస్ స్టేషన్లో లావణ్య అదృశ్యమైనట్లు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు మిస్సింగ్ కేసునమోదు చేసుకొనిదర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తడి ఆరని కన్నీటి ధార..

● ఐదు దశాబ్దాలుగా అంతర్గాం కాందిశీకుల ఆర్తనాదాలు

● ఏళ్లు గడిచినా పరిష్కారానికి నోచుకోని సమస్యలు

గోదావరిఖని, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాందీశీకులు కన్నీటి ధారలు ఆరడం లేదు.. వారిని కరుణించిన ప్రభుత్వాలే కన్నీట ముంచాయి... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు శ్రీలంక, బర్మాకు (మయన్మార్) బతుకుదెరువు కోసం వలస వెళ్లారు. 1970 ప్రాంతంలో అక్కడ కరువు ఏర్పడడంతో భారత ప్రభుత్వం వారిని కాందీశీకులుగా తీసుకువచ్చి దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉపాధి కల్పించింది. ఈ క్రమంలో పెద్దపల్లి జిల్లా అంతర్గాంలో స్పిన్నింగ్, వీవింగ్ మిల్లులు ఏర్పాటు చేసి వెయ్యి మందికి ఉపాధి కల్పించింది. వీవింగ్ మిల్లులో 509 మంది, స్పినింగ్ మిల్లులో 434 మంది కాందిశీకులు ఉద్యోగాలు చేశారు. అంతర్గాంలో కార్మికుల కోసం క్వార్టర్లు, ఇతర వసతులు కల్పించారు. 90వ దశకం వరకు అంతా సాఫీగా జరిగింది.



మూతపడిన వీవింగ్ మిల్లు

నేడు అంతర్జాతీయ శరణార్థుల దినోత్సవం

అందర్జాతీయ శరణార్థుల దినోత్సవాన్ని అంతర్గాం కాందిశీకులు జరుపుకోవ డానికి సిద్ధపడుతున్నారు. ఐదు దశాబ్దాలుగా పునరావాస సంక్షేమ పథకాలకు నోచుకోవడం లేదు. మిల్లుల మూసివేతతో ఉపాధి కోల్పోయి నిరుద్యోగం, ఆకలి, అనారోగ్యాలతో బతుకు భారమై కాలం వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వాలు, పాలకులు, అధికారులు ఇప్పటికైనా ఆదు కోవాలని వారు వేడుకుంటున్నారు. ఈ అంతర్జాతీయ శరణార్థుల దినోత్సవం నుండైనా అణగారిన అంతర్గాం కాందిశీలకుల జీవితాల్లో వెలుగులు నిండాలని ఆశిద్దాం...



మూతపడిన స్పిన్నింగ్ మిల్లు

● మిల్లుల మూసివేతతో కష్టాలు

యాజమాన్య లోపాలు, అవినీతి వల్ల స్పిన్నింగ్, వీవింగ్ మిల్లులు నష్టాల పాలయ్యాయి. 1989లో వీవింగ్ మిల్లును మూసివేశారు. దీంతో కార్మికులు ఉపాధి కోల్పోయారు. ఇందులో పని చేసిన 197 మంది కాందిశీకులు దుర్భర దరిద్ర్యాన్ని, వృద్ధాప్యాన్ని అనుభవిస్తున్నారు. 162 మంది కార్మికుల కుటుంబాలు వివిధ కారణాలతో మృతి చెందారు. స్పిన్నింగ్ మిల్లును 1991లో లే ఆఫ్ ప్రకటించి మూసివేశారు. ఇందులో పని చేసిన 434 మంది కార్మికులు రోడ్డున పడ్డారు.

● లక్ష్మీ స్పిన్నింగ్ మిల్లులో 1970 నుంచి 1991 వరకు కార్మికురాలిగా పని చేసింది. అంతర్గాంలో అప్పుడు ఆమెకు క్వార్టర్ ఇచ్చారు. ఆ పునరావాస కాలనీలో ఉన్న క్వార్టర్ 1994లో కూలి పోయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు తమ బకాయిలు వస్తాయని ఎదురు చూస్తున్న లక్ష్మి అదేస్థలంలో ఓ రేకుల షెడ్డు వేసుకుని జీవిస్తున్నది.

ఈ రెండు మిల్లుల కార్మికుల వేతనాల బకాయిల కూడా చెల్లించలేదు. క్వార్టర్లు శిథిలమయ్యాయి. ఆ స్థలాలకు పట్టాలు ఇవ్వలేదు. దీంతో వారికి నిలువ నీడ కరువైంది.

ఇళ్లన్నా ఇవ్వండి..: రామారావు, బర్మ, శ్రీలంక కాందిశీకుల సంఘం ప్రధాన కార్యదర్శి



జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ ప్రభుత్వాలు బర్మ, శ్రీలంక కాందిశీకులకు అంతర్గాంలో పునరావాసం కల్పించాయి. 350 ఎకరాల్లో వెయ్యి ఇళ్లు కట్టి వెయ్యి మందికి ఉపాధి కల్పించింది. ఇప్పుడు అంతర్గాం మిల్లులకు సంబంధించి భూములన్నీ అన్యాక్రాంతమవుతున్నాయి. అక్రమార్కులు కబ్జాలకు పాల్పడుతున్నారు. 50ఏళ్ల తరువాత కూడా కాందిశీకులం పునరావాసం కోసం వేడుకుంటున్నాం. ఉపాధి, ఉద్యోగాలు కల్పించడం సాధ్యం అయినా, కాకపోయినా తలదాచుకునేందుకు ఇంటి స్థలాన్ని, ఇల్లును ఇప్పించాలని కోరుకుంటున్నాను.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు..

● ఒకరి మృతి



నరేశ్(ఫైల్)

తంగళ్లపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామశివారులో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. వేములవాడ మండలం చింతల్‌ఠాణ ఆర్‌అండ్‌ఆర్‌కాలనీకి చెందిన కుర్మ నరేశ్(36) ద్విచక్రవాహనంపై చిన్నలింగపూర్‌లో రైల్వేలైన్ పనులు చేయడానికి వెళ్తున్నాడు. ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో నరేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే 108 వాహనంలో జిల్లా ప్రధానఆసుపత్రికి తరలించి చికిత్సచేస్తుండగా మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య మమత, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య

వీణవంక, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన ఆరెపల్లి అనూష(26) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసుల కథనం ప్రకారం.. అనూష కొంతకాలంగా అత్తగారింటికి వెళ్లకుండా తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పలుమార్లు అత్తగారింటికి వెళ్లాలని సూచించించారు. అత్తగారింటికి వెళ్ళడం ఇష్టంలేక అనూష 16వతేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వరంగల్ ఆసుపత్రికి తరలించగా బుధవారం చికిత్స పొందుతూ మృతిచెందింది. అనూష తండ్రి చిలువేరు నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎరువుల దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ దాడి



ముస్తాబాద్ ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ముస్తాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రంలోని ఎరువులు, విత్తనాలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు ఎస్సై గణేశ్, మండల వ్యవసాయాధికారి దుర్గరాజు, తంగళ్లపల్లి వ్యవసాయాధికారి సంజీవ్‌లు గురువారం తనిఖీచేశారు. మండల కేంద్రంలోని పలుదుకాణాల్లో లైసెన్స్‌లు, స్టాక్ రిజిష్టర్లు, బిల్ బుక్కులు తనిఖీ చేశారు. డీలర్లు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు అమ్మవద్దని హెచ్చరించారు. రశీదు లేకుండా ఏది అమ్మవద్దని, రైతులకు ఉపయోగపడే వాటినే విక్రయించాలని సూచించారు. అక్రమంగా నిలువ ఉంచిన విత్తనాలను అమ్మితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

గ్రామపంచాయతీ ఎదుట మహిళల బైఠాయింపు



ఓదెల గ్రామపంచాయతీ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న మహిళలు

ఓదెల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట గురువారం 10వ,వార్డు మహిళలు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మురికి కాలువల నిర్మాణం చేపట్టారని, ఇందులో మంచినీటి నల్లాల మరమ్మతులు చేపట్టలేదని మహిళలు తెలిపారు. మురికి కాలువల్లో నల్లాల నీరు వృథాగా పోతుండడంతో కాలువలు నిండి నీటినిలువతో దుర్వాసన, దోమలు అధికమవుతున్నాయని తెలిపారు. నీటినిలువ ఉండకుండా మంచినీటి నల్లాల మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తర లిస్తున్న ఒక ట్రాక్టర్‌ను గురువారం ఖాజీపూ ర్‌లో పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మందుబాబుల ఆగడాలు

● పాఠశాల మైదానాలు, పల్లెప్రకృతి వనాల్లో అడ్డా ● ప్రమాదకరంగా పగిలిన గాజుముక్కలు

● ఆందోళన చెందుతున్న విద్యార్థులు, ప్రజలు ● గస్తీ ఏర్పాటు చేయాలని వేడుకోలు



ఎల్ఎండీలోని శిశుమందిర్ పాఠశాల మైదానంలో తాగి పగలకొట్టిన మద్యం సీసాల ముక్కలు



ఎల్ఎండీలోని పాఠశాల మైదానంలో వెలుతురు కోసం వేసిన మంట, అందులో వేసిన ఖాళీ మద్యం సీసాలు

తిమ్మాపూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ఎండీకాలనీ మందుబాబులకు అడ్రస్‌గా మారింది. ఉదయం, సాయంత్రం తేడాలేకుండా మందుబాబులు మందు తాగేందుకు పాఠశాలలు, కూలిన ఎస్ఆర్ఎస్పీ క్వాటర్లు, పల్లె ప్రకృతివనాలను అడ్డాలుగా మార్చుకుంటున్నారు. రాత్రి అయిందంటే చాలు ద్విచక్రవాహనాలు, కార్లలో వచ్చి ఈస్థలాల్లో మద్యం తాగుతూ ఉంటారు. మద్యం బాటిళ్లను పగలగొట్టి వెళుతుండటంతో గాజుముక్కలు ప్రజలకు ప్రమాదంగా మారుతు న్నాయి. ఉదయం వాకర్స్, మైదానంలో ఆటలు ఆడేవారు ఈ మద్యం సీసా ముక్కలతో ఇబ్బంది పడుతున్నారు. ఎక్కడ గుచ్చుకుంటాయోనని ఆందోళనచెందుతున్నారు. రాత్రి సమయంలో అటు వైపుగా విద్యుత్‌దీపాలు సరిగా లేకపోవడంతో చీకట్లో మందుబాబులు ఆడిందే ఆటగా మారిందని స్థానికులు అంటున్నారు. రాత్రి సమయాల్లో బయటకు వెళ్లేందుకు భయమేస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పోలీసులు ఇటువైపు ప్రత్యేకంగా గస్తీ ఏర్పాటు చేసి మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన కందుల యశ్వంత్ కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామంలో ఏప్రిల్‌9న తన సెల్‌ఫోన్ పోగొట్టుకోగా వెంటనే కరీంనగర్‌రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌ను ఉపయోగించి ఫోన్‌ను రికవరీ చేశారు. కరీంనగర్ రూరల్ సీఐ ఎ నిరంజన్‌రెడ్డి గురువారం ఫోన్‌ను బాధితుడికి అందజేశారు. ఫోన్‌ను గుర్తించి, స్వాధీనం చేసుకోవటంలో కృషి చేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.



బాధితుడికి సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

హత్య కేసులో ఇద్దరికి ఏడేళ్ల జైలు

జగిత్యాల క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో గొడవపడి వ్యక్తి మృతికి కారణమైన ఇద్దరికి ఏడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి గురువారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం రాయికల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మాజీ పేటకు చెందిన సావన్‌పెల్లి శేఖర్(28) అనే వ్యక్తి వ్యవసాయం చేసుకుంటూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. 2022 మార్చి 22న శేఖర్ తన మిత్రుడు నాగభూషణంతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతకగా గ్రామ శివారులో శేఖర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై కిరణ్ కుమార్ కేసు నమోదు చేయగా జగిత్యాల రూరల్ సీఐ కృష్ణ కుమార్ దర్యాప్తు చేశారు. పోలీసుల దర్యాప్తులో శేఖర్ అనే వ్యక్తిని అతడి స్నేహితులు రస రాజేశం, బలిజ నాగభూషణంలు మద్యం మత్తులో గొడవ పడి పదునైన ఆయుధంతో పొడిచి హత్యకు పాల్పడ్డట్లు గుర్తించారు. ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు నరేష్, కిరణ్ కుమార్‌లు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లిఖార్జున్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ఇద్దరు ముద్దాయిలు రాజేశం, నాగభూషణంలకు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ముద్దాయిలకి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

చోరీ కేసులో నిందితుడికి 6 నెలల జైలు

కరీంనగర్ క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని శ్రీ శివభక్తి ఆంజనేయ స్వామి దేవాలయంలో పంచలోహ విగ్రహం, గోముఖం, ఇతర వస్తువులు దొంగత నానికి పాల్పడిన కేసులో నిందితుడు గట్టుబూత్కూర్‌కు చెందిన ఎగుర్ల గట్టయ్యకు కరీంనగర్ ఏడీఎం కోర్టు మెజిస్ట్రేట్ 6 నెలల జైలుశిక్ష, 400 రూపాయల జరిమానా విధించారని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. చోరీ కేసులో నిందితు డిని జనవరి 6న అరెస్టు చేయగా గురువారం తీర్పు వెలువడిందని తెలిపారు. నిందితుడికి శిక్ష పడటంలో కృషి చేసిన కొత్తపల్లి ఎస్ఐ సాంబమూర్తి, కోర్టు కానిస్టేబుల్ మౌనికలను సీఐ అభినందించినట్లు తెలిపారు.

రూ.7400 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూన్ 19 (ఆంధ్ర జ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7400 పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు ఐదుగురు రైతులు 76క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వార గరిష్ఠ ధర రూ.7400, కనిష్ఠ ధర రూ.7200 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఎనిమిదేళ్లుగా రేషన్‌కార్డు కోసం ఎదురుచూపులు

● బియ్యం కోసం ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబం

చిగురుమామిడి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): చిగురుమామిడి మండలంలోని రామంచ గ్రామానికి చెందిన దర్శనం మౌనిక-సహదేవ్ దంపతులు ఎనిమిది సంవత్సరాలుగా రేషన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్నారు. రోజుకూలి చేసుకునే వీరిది పేద కుటుంబం. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పేదప్రజలకు ఇచ్చే రేషన్ కార్డులు అర్హులకు అందడం లేదనడానికి వీరు ప్రత్యక్ష ఉదాహరణ. రోజువారి ఆహారం కోసం దుకాణాల్లో డబ్బులుపెట్టి బియ్యం కొని తెచ్చుకుంటున్నారు. దీంతో కూలి డబ్బులుకాస్తా తినే తిండికే సరిపోతున్నాయని వారు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు.

పనిదొరకని రోజు పిల్లలు వారు పస్తులుండాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి అర్హులైన వారిని గుర్తించి రేషన్‌కార్డులు అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

● కూలి డబ్బులు బియ్యానికే సరిపోతున్నాయి..

- దర్శనం మౌనిక-సహదేవ్..

మేము అనేక సంవత్సరాలుగా రేషన్‌కార్డు కోసం దరఖాస్తులు చేసుకుంటూనే ఉన్నాం. ఐనప్పటికీ మాకు రేషన్‌కార్డు రాలేదు. రోజు కూలి పనులు చేసుకుంటూ వచ్చిన డబ్బులతో సగం డబ్బుతో బియ్యం తీసుకువచ్చి కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. చేతికి పని దొరకని రోజు పస్తులుండుడే. అధికారులు మాపై దయ చూపి రేషన్‌కార్డు ఇచ్చి ఆదుకోవాలి.



ఇంటి ఎదుట పిల్లలతో మౌనిక, సహదేవ్ దంపతులు

బావిలో పడి ఒకరి మృతి

ధర్మారం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగాపూర్ గ్రామా నికి చెందిన గొర్ల కాపరి పెద్ది మల్లయ్య(61) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. గురువారం ఉదయం గొర్ల కాపలకు గ్రామ శివారులోకి వెళ్ళాడు. ఎండ తీవ్రత అధికంగా ఉండగా బావి వద్ద ఉన్న చెట్టుకింద సేదదీరుతూ అందులో పడి మృతి చెందాడు. మిగితా కాపర్లు వచ్చి చూసే సరికి బావిలో చెప్పులు తేలి ఉండడం, కర్ర బావి వద్ద ఉండడంతో అందులో పడినట్లు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మల్లయ్య భార్య పెద్ది పోశవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

సుడా నిధులతో గ్రామాల అభివృద్ధి

● గుండ్లపల్లి స్టేజివద్ద వీధి దీపాలను ప్రారంభించిన ఎమ్మెల్యే, సుడా చైర్మన్

గన్నేరువరం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సుడా నిధులతో సుడా పరిధిలోని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని గుండ్లపల్లి స్టేజి నుండి గన్నేరువరానికి వెళ్లే ప్రధాన రహదారిలో రూ.20లక్షల సుడా నిధులతో ఏర్పాటు చేసిన వీధిదీపాలను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డితో కలిసి ఆయన గురువారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుడా పరిధిలోని గ్రామాలకు మహర్దశ పట్టనున్నదని అన్నారు. సుడా నిధులతో నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను చేపట్టామని అన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సుడా పరిధిలోని అన్ని గ్రామాలను అభివృద్ధి పరిచేందుకు నిధుల మంజూరుకు కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, నాయకులు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, కొమ్మెర రవిందర్ రెడ్డి, ముల్కల మల్లేశం, బేతెల్లి రాజేందర్‌రెడ్డి, వంగల సత్తిరెడ్డి, బొల్లి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



స్ట్రీట్ లైట్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

అటవీ ప్లాంటేషన్ సర్వేను అడ్డుకున్న రైతులు

● వెనుదిరిగిన అధికారులు

వీర్నపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం రంగంపేట గ్రామంలో 30ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న అటవీభూముల్లో ప్లాంటేషన్ కోసం సర్వే చేయద్దని అటవీ శాఖ అధికారులను రైతులు అడ్డుకున్నారు. తమ భూముల్లో సర్వే చేయద్దంటూ రైతులు రోడ్డుపై భీష్మించుకు కూర్చున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంత అటవీ భూమిసాగులో ఉందని తెలుసు కునేందుకే సర్వే చేస్తున్నామని అల్మాస్‌పూర్, గొల్లపల్లి సెక్షన్ అధికారులు పద్మలత, సక్కారాం రైతులకు వివరించారు.

అయినా రైతులు ఒప్పుకోకపోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. రైతులు వినిపించుకోకపోవడంతో అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందించి తదుపరి చర్యలు తీసుకుంటామని అధి కారులు తెలిపారు. రాత్రిపూట భూములను సాగు చేయకుండా బేస్ క్యాంపు సిబ్బంది, వాచర్లు గస్తీ నిర్వహిస్తున్నారు.



రోడ్డుపై బైఠాయించిన రైతులు

వేములవాడలో ముగిసిన కూల్చివేతలు

● మిగిలిన శిథిలాల తొలగింపు



కూల్చివేతలో భాగంగా సగం తొలగించిన భవనం

వేములవాడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలోని ప్రధానరహదారి విస్తరణలో భాగంగా చేపట్టిన ఇళ్లు, భవనాల కూల్చివేత పనులు దాదాపుగా పూర్తయ్యాయి. రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానం ముందు నుంచి మూలవాగు బ్రిడ్జి వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న నిర్మాణాలను తొలగించే ప్రక్రియను అధికార యంత్రాంగం ఆదివారం ప్రారంభించగా, బుధవారం రాత్రికి కూల్చివేతలు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉన్న రోడ్డును 80అడుగుల మేరకు విస్తరించే క్రమంలో 243ఇళ్లను తొలగించాల్సి ఉండగా, ఇందులో 80ఇళ్లకు సంబంధించిన యజమానులు కోర్టును ఆశ్రయించి స్టేపొందడంతో వాటిని మినహాయించి మిగతా వాటిని అధికారులు కూల్చివేశారు. రోడ్ల వెడల్పుకోసం సేకరించాల్సిన స్థలంమేరకు మార్కింగ్ చేసి ప్రొక్లెయినర్లతో కూల్చివేశారు. మిగిలిపోయిన నిర్మాణం సైతం దెబ్బతినే అవకాశం ఉండడంతో కొందరు ఇంటియజమానులు నష్టపోయే భాగాన్ని కూల్చివేసేందుకు తమకే అవకాశం ఇవ్వాలని కోరడంతో అధికారులు అందుకు అంగీకరించారు. పాక్షికంగా కోల్పోతున్న ఇళ్లు, ఇతర నిర్మాణాలలో సంబంధిత యజమానులు కూలీల సహాయంతో తొలగింపు పనులు చేపట్టారు. ఇదిలాఉండగా ఇప్పటివరకు కూల్చివేత పూర్తయిన వాటికి సంబంధించిన శిథిలాలను తరలించాల్సి ఉండగా, అందుకు సంబంధిత నిర్మాణాల యజమానులకే అవకాశం ఇచ్చామని మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తెలిపారు. ఇందుకోసం నాలుగు రోజులు సమయం ఇస్తున్నామని, అప్పటిలోగా శిథిలాలు తరలించాలని లేనిపక్షంలో తామే శిథిలాలను తరలిస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఉమ్మడి నాలుగు జిల్లాల వాలీబాల్ పోటీలు ప్రారంభం



వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న పుట్ట మధు

పెద్దపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పరికిపండ్ల నరహరి ఐఏఎస్ తండ్రి పరికిపండ్ల సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆలయఫౌండేషన్ ఆధ్వర్యంలో బసంత్‌నగర్‌లో ఉమ్మడి నాలుగు జిల్లాల వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. గురువారం ప్రారంభమైన ఈపోటీలకు ముఖ్య అతిథులుగా మాజీ జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీఆర్ఎస్ నాయకులు కౌశిక్ హరి, బీజేపీ నాయకురాలు కందుల సంధ్య రాణి, బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష హాజరయ్యారు. వారు మాట్లాడుతూ యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించేందుకు ఇలాంటి టోర్నమెంట్లు ఎంతగానో దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. మూడు రోజులపాటు జరిగే ఈ పోటీలకు ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, నిజామాబాద్ జిల్లాల నుంచి 32జట్లు పాల్గొంటున్నాయి. ఆలయ ఫౌండేషన్ సీఈవో రమేశ్ బాబు, అడిషనల్ సీఈవో మిట్టపల్లి రాజేంద్ర కుమార్, డిప్యూటీ సీఈవో కీర్తి నాగార్జున, ఫౌండేషన్ సభ్యులు పరికిపండ్ల రాము, లక్ష్మణ్, పుప్పాల దయానంద్, రామస్వామి, సోము శ్రీనివాస్, జాగిరి శ్రీకాంత్, కన్నం వెంకటేష్, కమలాకర్ రెడ్డి, శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్, పెద్దపల్లి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

● ఎస్పీ అశోక్ కుమార్



వాహనానికి నంబరు ప్లేట్ బిగిస్తున్న పోలీసులు

జగిత్యాల క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నంబర్ ప్లేట్ లేకుండా, కొత్త వాహనాలకు రిజిస్ట్రేషన్ చేయించకుండా నడిపితే చర్యలు తప్పవని ఎస్పీ అశోక్ కుమార్ హెచ్చరించారు. ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలమేరకు జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో గురువారం పోలీసులు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడుపుతున్న 306వాహనదారులను గుర్తించి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వాహన నంబర్లను ట్యాంపరింగ్‌చేస్తే వాహనాలను సీజ్‌చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పని సరిగా పాటించాలని ఎస్పీ కోరారు.



సిరిసిల్ల జిల్లాకు

ఆర్చరీ అకాడమీ

నేడు ప్రారంభించనున్న రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్

సిరిసిల్ల టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో వాలీబాల్ అకాడమీకి అనుమతులు లభించాయి. గత సంవత్సరం నుంచే జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్ జిల్లా కేంద్రంలో ఆర్చరీ అకాడమీ ఏర్పాటుకు ప్రయత్నాలు చేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ చొరవతో ఎట్టకేలకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ నుంచి ఆర్చరీ అకాడమీ ఏర్పాటుకు సానుకూలంగా స్పందన వచ్చింది. ఇటీవల సిరిసిల్ల మినీ స్టేడియంలో ఆర్చరీ అకాడమీ ఏర్పాటుకు, విద్యార్థుల శిక్షణకు కావాల్సిన సౌకర్యాలను స్పోర్ట్స్ అథారిటీ అధికారులు పరిశీలించారు. అనుకూల వాతావరణం ఉండడంతో ఆర్చరీ అకాడమీ ఏర్పాటుకు అనుమతులను మంజూరు చేశారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో ఆర్చరీ అకాడమీని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనారెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ ప్రారంభించనున్నారు. అకాడమీ ప్రారంభోత్సవం అనంతరం ఆర్చరీ అకాడమీలో చేరికలకు 14 నుంచి 16 ఏళ్లలోపున్న 20 మంది విద్యార్థులను ఎంపిక చేయనున్నారు.

కబడ్డీ అకాడమీ మంజూరు చేయాలి

మదన్, కబడ్డీ అసోసియేషన్ సహాయ కార్యదర్శి



గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా కబడ్డీ క్రీడకు ప్రాధాన్యం ఉంది. కబడ్డీ క్రీడకు ప్రభుత్వాలు ప్రోత్సాహం అందించాలి. జిల్లాలో వాలీ బాల్, అర్చరీ అకాడమీ రావడం ఆనందంగా ఉంది. జిల్లాలో కబడ్డీ అకాడమీని మంజూరు చేయాలి. కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ప్రత్యేక క్రీడా శిబిరాలతో శిక్షణ ఇస్తున్నాం. ప్రభుత్వం, అధికారులు కూడా ప్రోత్సాహం అందిస్తే జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణిస్తారు.

మరిన్ని క్రీడా అకాడమీలు రావాలి..

సీహెచ్ శ్రీకుమార్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు



రాజన్న సిరిసిల్ల జిల్లాకు మరిన్ని క్రీడా అకాడమీలు రావాలి. క్రీడలకు పుట్టినిల్లు అయిన రాజన్న సిరిసిల్ల జిల్లాలో క్రీడాకారులకు కొదవలేదు. గ్రామీణ స్థాయి నుంచి జిల్లా కేంద్రం వరకు ప్రతి క్రీడలో క్రీడాకారులు ప్రావీణ్యం సాధిస్తున్నారు. ప్రభుత్వం, జిల్లా అధికా రులు మరింత ప్రోత్సాహం ఇస్తే జాతీయ స్థాయిలో విజయాలను సాధిస్తారు. వాలీబాల్ అకాడమీతో పాటు అర్చరీ అకాడమీ ప్రారంభం కానుండడం ఆనందంగా ఉంది.

విలోచవరంలో పోచమ్మ బోనాలు

మంథనిరూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విలోచవరంలో గురువారం పోచమ్మతల్లికి సామూహిక బోనాలను సమర్పించారు. వర్షాకాలం పంటల సాగు ముందు పిల్లా పాపలతో గ్రామంలోని పోచమ్మ తల్లికి బోనాన్ని నైవేద్యంగా సమర్పిస్తారు. గ్రామస్థులంతా డప్పుల చప్పుళ్లతో గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న పోచమ్మ తల్లిని దర్శించుకున్నారు.



పోచమ్మతల్లి వద్దకు వెళ్తున్న గ్రామస్థులు

రాజన్న నిత్యాన్నదాన సత్రానికి విరాళం అందజేత



ఏఈవో శ్రావణ్‌ను కలిసి చెక్కులు అందజేసిన దాతలు

వేములవాడ కల్చరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి నిత్యాన్నదానానికి దాతలు విరాళాన్ని అందజేశారు. సుప్రీంకోర్టులో అడ్వకేట్‌గా చేస్తూ న్యూఢిల్లీలో నివాసం ఉంటున్న బోయినపల్లి మండలం వర్దవల్లి గ్రామానికి చెందిన పీచర శ్రీహర్ష, ఆయన స్నేహితుడు శ్రీకృష్ణకుమార్ కుటుంబసభ్యులతో కలిసి రాజన్నను దర్శించుకున్నారు. స్వామివారి దర్శనం అనంతరం రాజన్న నిత్యాన్నదాన సత్రానికి చెరో లక్ష రూపాయల చొప్పున ఏఈవో శ్రావణ్‌కుమార్‌కు అందజేశారు. వారివెంట కాంగ్రెస్ జిల్లా నాయకుడు చింతపల్లి శ్రీనివాస్‌రావు ఉన్నారు.

నిధుల గోల్‌మాల్‌పై చర్యలేవి?

● జగిత్యాల జిల్లా వైద్య విధాన పరిషత్‌లో రూ.7కోట్లు దుర్వినియోగం

● ఏడాది అవుతున్నా ఎటూ తేలని వ్యవహారం

● తాజాగా సూపరింటెండెంట్ ఫిర్యాదుతో పోలీసుల ఆరా



విచారణ జరుపుతున్న అధికారులు(ఫైల్)

జగిత్యాల అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా వైద్య విధాన పరిషత్‌లో గత ఏడాది జరిగిన రూ.7కోట్ల నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో సొమ్ము రికవరీ కాలేదు. ఈ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించగా ఉన్నతాధికారులు వైద్యవిధానపరిషత్ రికార్డు అసిస్టెంట్ యాసిన్‌ను సస్పెండ్ చేసి రెండున్నర కోట్లు రికవరీ చేసినా మిగతాసొమ్ము సంగతి అధికారులు పట్టించుకోలేదు. తాజాగా గతమేనెలలో టీవీవీపీ (తెలంగాణ వైద్యవిధానపరిషత్) జగిత్యాల సూపరింటెండెంట్ ఎస్పీ అశోక్‌కుమార్‌కు ఫిర్యాదు చేయడంతో నిధుల గోల్ మాల్ వ్యవహారం మళ్లీ ముందుకు వచ్చింది.

● అవినీతి బయట పడిందిలా..

కోరుట్ల టీవీవీపీ సూపరింటెండెంట్ గత సంవత్సరం ఒక చెల్లింపు విషయంలో వైద్య విధానపరిషత్‌కు చెందిన బ్యాంక్ ఓచర్‌పై 8వేల రూపాయలు రాసి ఇచ్చారు. రికార్డు అసిస్టెంట్ దానిని 28లక్షల రూపాయలుగా మార్చి ఇదే డిపార్ట్‌మెంట్‌కు చెందిన మరో వినియోగం లేని అకౌంట్‌లో వేయడంతో ఈ అక్రమాల వ్యవహారం బయటకు వచ్చింది. దీంతో ఈ విషయమై ఉన్నతాధికారులు విచారణ జరపడంతో వైద్యవిధాన పరిషత్‌కు చెందిన యాసిన్ అనేఉద్యోగి ఈ అకౌంట్‌ను వాడుతున్నట్లు గుర్తించారు. వెంటనే ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీని నియ మించారు. అయితే ఈ విచారణలో ఉద్యోగుల ఖాతాలో జమ చేయా ల్సిన డీఏ, ఏరియర్స్, సీపీఎస్ ఏరియర్స్, మరియు రెగ్యులర్ ఏరి యర్స్‌తోపాటు వివిధ ఖాతాల్లో వేయాల్సిన ఏడుకోట్ల సొమ్ము పక్క దారి పట్టినట్లు విచారణ కమిటీ సభ్యులు గుర్తించారు. అయితే వినియోగంలో లేనిఖాతాకు సొమ్ము మళ్లించిన యాసిన్ తనదగ్గరి వ్యక్తుల ఫోన్ నంబర్‌ను ఖాతాకు లింక్ చేసి దానిపై యూపీఏ అకౌంట్‌క్రియేట్ చేసి డబ్బులు డ్రా చేసినట్లు అధికారులు గుర్తించారు.

● 2020 నుంచి ఆడిట్ చేస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి..

జగిత్యాల జిల్లా వైద్యవిధాన పరిషత్‌లో రికార్డు అసిస్టెంట్ యాసిన్ 2020నుంచి లావాదేవీలు పర్యవేక్షిస్తుండగా ఆడిట్ అధికారులు 2022నుంచి ఆడిట్ చేశారు. మరో రెండు సంవత్సరాల ఆడిట్ నిర్వహించి మరింత లోతుగా విచారణ జరిపితే మరింత అవినీతి బయట పడే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు. నిధుల గోల్‌మాల్‌పై గతంలో విచారణ జరిపిన కమిటీ సభ్యులకు బ్యాంక్‌అధికారులు సహకరించక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నట్లు అధికారులు భావిస్తున్నారు. వినియోగంలో లేని ఖాతాను తిరిగి తెరిచేందుకు జిల్లా అధికారుల సంతకం ఫోర్జరీ చేశారా అనే కోణంలో విచారణ జరిపితే అన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

● ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు

- రామకృష్ణ, సూపరింటెండెంట్ టీవీవీపీ, జగిత్యాల

జగిత్యాల అర్బన్, జగిత్యాల జిల్లా తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో గతసంవత్సరం జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాల్సిందిగా జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. పోలీసుల విచారణ అనంతరం అక్రమాలకు పాల్పడిన వారిపై ప్రభుత్వ ఆదేశాలకు మేరకు చర్యలు చేపడతాం.

మాజీ ఎంపీటీసీ కుంటయ్య ఆరోపణల్లో నిజం లేదు..

● రూరల్ సీఐ మొగిలి



మాట్లడుతున్న రూరల్ సీఐ మొగిలయ్య

తంగళ్లపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మాజీఎంపీటీసీ కుంటయ్య చేసిన ఫిర్యాదును పట్టించుకోలేదని పోలీసులపై అసత్యప్రచారం, తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని రూరల్ సీఐ మొగిలి అన్నారు. బుధవారం సీఐ విలేకరుల సమావేశంలో మాట్లడుతూ తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ మాజీఎంపీటీసీ కర్కబోయిన కుంటయ్య 2023జూలై 25వ తేదిన లేని భూమిని తనకు మల్యాల నాగరాజు రిజిస్ట్రేషన్ చేశాడని ఫిర్యాదు చేశాడన్నారు. దీనిపై స్పందించి మల్యాల నాగరాజుపై చీటింగ్ కేసు నమోదు చేసి సాక్ష్యాధారాలు సేకరించి న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేసినట్లు తెలిపారు. అలాగే తంగళ్లపల్లికి చెందిన గంగ కిష్టరెడ్డి 2024 డిసెంబర్ 12వతేదిన కర్కబోయిన కుంటయ్య భూమి విషయంలో మోసం చేశాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. కుంటయ్యపై కేసు నమోదుచేసి దర్యాప్తు జరిపి న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేసినట్లు తెలిపారు. ఈక్రమంలో పోలీసులపై తప్పుడు ఆరోపణలు, వదంతులు ప్రచారం చేస్తున్నారని అన్నారు. పోలీసులు న్యాయబద్ధంగా, నిష్పక్షపాతంగా స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకుంటారన్నారు. పోలీసులు భూమి సంబంధించిన అంశాలు, సివిల్ వివాదాల్లో ఎటువంటి జోక్యం చేసుకోలేదని, చట్టపరిధిలో విచారించారని తెలిపారు. భూమిఅంశాలు, సివిల్‌వివాదాలను న్యాయస్థానంలో పరిష్కరించుకోవాలని తెలిపారు.

రేపు జాబ్ మేళా

గణేశ్‌నగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు కరీంనగర్‌లోని రిలయన్స్ నిప్పన్ లైఫ్ ఇన్సూరెన్స్ కరీంనగర్‌లో ఉద్యోగాలు కల్పించడానికి 21న శనివారం తనిష్క్ జ్యువెలర్స్ 4వ అంతస్తు, గెస్ట్ హౌస్ ఎదురుగా, సవరన్ వీధి కరీంనగర్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి వై.తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. రిలయన్స్ నిప్పన్ లైఫ్ ఇన్సూరెన్స్ లో 2 లైఫ్ ప్లానింగ్ అధికారి, అప్రెంటీస్, ఎల్‌పిఏ 20 పోస్టులు ఖాళీలు ఉన్నాయని, వీటికి మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ఏదైనా డిగ్రీ ఆపై చదివి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని, వారి వయస్సు 20 సంవత్సరాలు, నెలసరి వేతనం 20 వేలు ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు జూన్ 21న ఉదయం 11 గంటలకు సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో ఆర్అండ్ బి గెస్ట్‌హౌస్ ఎదురుగా, తనిష్క్ జ్యువెలర్స్ 4వ అంతస్తు, కరీంనగర్ కు వచ్చి పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెం. 9848168440, 6281363909 నందు సంప్రదించాలని తెలిపారు.

గుడుంబా పట్టివేత

వెల్గటూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలంలోని జగదేవపేట గ్రామా నికి చెందిన దారంగుల మల్లేష్ గుడుంబా అమ్ముతుండగా పట్టుకున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ ఎవరైనా గుడుంబా తయారు చేసినా, అమ్మినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

ద్విభాషా పుస్తకాలు



● తెలుగు, ఇంగ్లీషులో ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు

● విద్యార్థులకు ఉపయోగకరం

కరీంనగర్ టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాలుగేళ్ల క్రితం నుంచే ఇంగ్లీష్ మీడియం ప్రారంభించారు. అయితే ఇప్పటి వరకు తెలుగు మీడియంలో చదివిన విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంలో చదవడం కష్టంగా మారింది. దీంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాఠాలను అర్థం చేసుకోలేక పోతున్నారని విద్యాశాఖ అధికారులు గుర్తించారు. దీన్ని అధిగమించడానికి పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాలను ఒక పక్క ఇంగ్లీష్, మరో పక్క తెలుగులో ముద్రించి ఇవ్వాలని నిర్ణయించింది. గత ఏడాది 1 నుంచి 10వ తరగతి వరకు గణితం, ఫిజిక్స్, బయాలజీ, సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకాలను ఇంగ్లీష్, తెలుగు బాషల్లో అచ్చు వేసి పంపిణీ చేసింది.

పేజీలు ఎక్కువ ఉండడంతో రెండు భాగాలుగా..

ఈ యేడాది కూడా గణితం, జీవశాస్త్రం, భౌతిక శాస్త్రం, సాంఘిక శాస్త్రం పాఠ్య పుస్తకాల్లోని మొత్తం చాప్టర్లను ఒక పేజీ ఇంగ్లీష్, దాని పక్కనే మరో పేజీలో తెలుగు బాషల్లో ముద్రించారు. పేజీలు పెరగడంతో వీటి పరిమాణం, బరువు ఎక్కువ అవుతుండడంతో విద్యార్థుల సౌలభ్యం కోసం రెండు భాగాలుగా విభజించారు. మొదటి బాగం జూన్ నుంచి అక్టోబరు వరకు ఎస్ఏ-1 పరీక్షల కోసం పార్ట్-1గా, రెండో భాగం నవంబరు నుంచి మార్చి వరకు ఎస్ఏ-2 పరీక్షల కోసం (పార్ట్-2)గా విభజించారు.

ఆకర్షణీయంగా..

పాఠశాలలు పునఃప్రారంభమైన 12వ తేదీ నుంచే ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. పుస్తకాల కవర్ పేజీ ముద్రణలు చాలా ఆకర్షణీయంగా ఉన్నాయి. ఈ పుస్తకాల్లో పాఠ్యాంశాలకు అనుగుణంగా రంగురంగుల బొమ్మలు చూడగానే పాఠం సారాంశం అర్థమయ్యేలా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. దీనికి తోడు పాఠ్యపుస్తకాల్లో ప్రతీ పాఠానికి ఒక క్యూ ఆర్ కోడ్ ఉంటుంది. దీనిని మొబైల్ ద్వారా స్కాన్ చేసి ఆపాఠానికి సంబంధించిన వీడియోలను వీక్షించవచ్చు. తెలుగు మీడియం నుంచి వచ్చిన విద్యార్థులు ఇంగ్లీష్ మీడియంలో సులువుగా చదివి రాణిస్తారని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.

విద్యార్థులు అవగాహన పెంచుకోవచ్చు

చకినాల రామ్మోహన్, ఎస్ఏ గణితం, తిమ్మాపూర్ మండలం



పాఠ్యపుస్తకాలను రెండు బాషల్లో ముద్రించడం విద్యార్థులకు ఉపయోగకరంగా ఉన్నాయి. ఇంగ్లీష్ మీడియంలో వెనకబడిన విద్యార్థులు తెలుగులో చదివి అవగాహన పెంచుకోవచ్చు.

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

సుభాష్‌నగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వనిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ అంబేద్కర్ యువజనసంఘం జిల్లా అధ్యక్షుడు క్యాదాసి ప్రభాకర్ డిమాండ్‌చేశారు. గురువారం నగరంలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. చాలావిద్యాసంస్థల్లో విద్యార్థులకు ఆటస్థలం లేదని, పార్కింగ్ లేదని అన్నారు. విద్యాహక్కుచట్టాన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో 25శాతం సీట్లు ఎస్సీ ఎస్టీవర్గాల పిల్లలకు ఉచితంగా కేటాయించాలని, స్టేషనరీ కూడాఉచితంగా అందచేయాలని చట్టం చెబుతుందన్నారు. ఈ చట్టాన్ని అమలు చేయని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీబీఎస్ఈ చట్టం ప్రకారం ప్రతిపాఠశాలలో పేరెంట్స్, టీచర్స్ అసోసియేషన్‌లో ఇద్దరు తల్లిదండ్రులకు భాగస్వామ్యం కల్పించాలన్నారు. అసోసియేషన్ సూచనమేరకే ఫీజులు పెంచాలని తెలిపారు. నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై సంబంధిత అధికారులు తగినచర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్షచేపడతామని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్రకార్యదర్శి మీసాలసాయిలు, జిల్లాప్రధానకార్యదర్శులు మైసనిమనోహర్, మానాలనారాయణ, చామనపల్లిచంద్రశేఖర్,ఉపాధ్యక్షులు గండిగణేష్, తాటిపల్లి జంపన్న తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలను పరిశుభ్రంగా ఉంచాలి

● జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ



కొత్తపల్లి ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ

భగత్‌నగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ అన్నారు. కొత్తపల్లి ప్రాథమికఆరోగ్య కేంద్రాన్ని ఆయన గురువారం పరిశీలించారు. అవుట్ పేషంట్ రిజిస్టర్‌లు, ఇతర రికార్డులను పరిశీలించారు. ఎన్‌సీడీ క్లినిక్‌లో అసంక్రమిత వ్యాధుల రిజిస్టరైన రెడ్ పుస్తకం, బ్లూ పుస్తకాలను పరిశీలించారు. అందులో రక్తపోటు, షుగర్ వ్యాధిగ్రస్తుల వివరాల నమోదును పరిశీలించి వారికి మందులు ఇస్తున్న తీరును పరిశీలించారు. ఫార్మసి స్టోర్‌లో సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందుల నిల్వలను పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్‌ను, ప్రసూతి గది పరిశుభ్రతలను పరిశీలించి అందులో ఉండాల్సిన అత్యవసర మందులను పరిశీలించారు. మొదటి కాన్పులను సిజేరియన్ చేయించు కోవడంవల్ల కలిగే సమస్యలను వివరించి సాధారణ ప్రసవాలు ఆరోగ్యకేంద్రాల్లో జరిగేట్లు గర్భవతులను వారి కుటుంబసభ్యులను ప్రోత్సహించాలన్నారు.

● ఫీల్డ్ ట్రైనింగ్..

బీఎంఎస్ డాక్టర్లకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగే ఆరోగ్యకార్యకలాపాలపై ఫీల్డ్ ట్రైనింగ్‌లో భాగంగా అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పీవోఎంహెచ్ఎన్ డాక్టర్ సన జవేరియా, కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి నజియా, డీపీవో ఎన్‌హెచ్ఎం స్వామి, సాగర్, బీఐఎంఎస్ డాక్టర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదినం

ఉస్మానియా టాపర్‌కు సన్మానం



విద్యార్థినిని అభినందిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని అవినాష్ డిగ్రీ కళాశాలలో చదువుతున్న గోదావరిఖనికి చెందిన యువకూరలు ప్రత్నరాతి అనే విద్యార్థినికి ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ప్రథమ ర్యాంకు సాధించింది. ఆమెను గురువారం రాత్రి గోదావరిఖని రాజస్థాన్ భవన్‌లో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ సన్మానించారు. ఆయన మాట్లాడుతూ బీటెక్, పీజీలు చేసిన నిరుద్యోగులకు జాబ్‌మేళాలు నిర్వహించి ఉద్యోగాలు ఇప్పిస్తానన్నారు. మారుతున్న సాంకేతిక, సామాజిక పరిస్థితులకు అనుగుణంగా అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆయన సూచించారు.

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష

ఎలిగేడు జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివపల్లి గ్రామంలోని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు నివాసంలో గురువారం పంచాయత్‌రాజ్‌శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని ఆదేశించారు. పంచాయతిరాజ్ ఈఈ గిరిష్‌బాబు, డిఇ లు దేవెందర్, రవిందర్‌లు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను జిల్లాలో గురువారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. సుల్తానాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే విజయ రమణారావు కేక్ కట్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశాన్ని పాలించే సత్తా, సమర్థత రాహుల్ గాంధీకే ఉందని అన్నారు. దేశ భద్రత విషయంలో జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ మొదలుకొని అధికారంలో ఉన్న ప్రతిసారి రాజీ పడలేదని అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, సాయిరి మహేందర్, పన్నాల రాములు, శ్రీనివాస్ గౌడ్, రాజలింగం, అబ్బయ్యగౌడ్, సతీష్, దామోదర్ రావు,కిషోర్, తిరుపతి, అమీనొద్దిన్, బిరుదు క్రిష్ణ, పాల్గొన్నారు.

● కళ్యాణ్‌నగర్: బడుగు బలహీనవర్గాల సమస్యలపై నిత్యం పార్లమెంట్‌లో గళం విప్పే వ్యక్తి రాహుల్ గాంధీ అని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కన్యకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేసి పేద ప్రజలు పడుతున్న కష్టాలను తెలుసుకుని బీసీ, ఎస్‌సీ రిజర్వేషన్ చేయాలని సూచించారన్నారు. రాహుల్ గాంధీ ఆశయ సాధనను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహిస్తున్నారన్నారు. నాయకులు కాల్వ లింగస్వామి, మహంకాళి స్వామి, పెద్దెల్లి ప్రకాష్, కొలిపాక సుజాత, ముస్తాఫా, బొమ్మక రాజేష్, సుతారి లక్ష్మణ్‌బాబు, దూళికట్ట సతీష్, పోషం, యాకూబ్ పాల్గొన్నారు.

● యైటింక్లయిన్‌కాలనీ : ఏఐసీసీ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ జన్మదినోత్సవాన్ని గురువారం కాలనీలో ఘనంగా నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తాలో కేక్ కట్‌చేసి, స్వీట్లు పంచారు. యువనాయకుడు రాహుల్ నేతృత్వంలో పార్టీ పునర్ వైభవం సంతరించుకుంటుందని పేర్కొన్నారు. పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్, నాయకులు శంకర్ నాయక్, తిరుపతిరెడ్డి, అనుము రాములు, ఆకుల రాజిరెడ్డి, సారయ్యనాయక్, సాగర్, అవినాష్, రేశవేని కేశవులు, దశరథం, రాకేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.





సుల్తానాబాద్, గోదావరిఖనిలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలో ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్

● మంథని: కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ పుట్టిన రోజు వేడుకలను గురువారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. అంబేద్కర్ చౌక్‌లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు, శ్రేణులు పాల్గొన్నారు.

● పెద్దపల్లిటౌన్: రాహుల్ గాంధీ జన్మదినం పురస్కరించుకొని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భూషణ వేణి సురేష్ గౌడ్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బొంకూరి అవినాష్ ఆధ్వర్యంలో జెండా చౌరస్తా వద్ద కాంగ్రెస్ శ్రేణులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరిగేలా పార్లమెంటులో ప్రతిపక్ష హోదాలో విలువైన సూచనలు ఇస్తూ దేశ ఔన్నత్యాన్ని కాపాడుతున్నారన్నారు. మాజీ కౌన్సిలర్లు కల్వనా రమేష్ శ్రీమాన్, సయ్యద్ మస్రాత్, బొడ్డుపల్లి శ్రీనివాస్, జగదీష్ నాయకులు బండారి సునీల్ గౌడ్ తోట ఫణీంద్ర భూపతి దేవనంది దేవరాజు పాల్గొన్నారు.

● జూలపల్లి: రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను గురువారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. నాయకులు మానుమండ్ల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మెన్ గండు సంజీవ్, చీదురు శ్రీనివాస్, బండి స్వామి,కోరికంటి మల్లయ్య, కొట్టె సంజీవ్, ముమ్మాడి రవి, వేల్పుల లింగయ్య, ఆవుల సంతోష్ పలువురు పాల్గొన్నారు.

● కాల్వశ్రీరాంపూర్ : మండల కేంద్రంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మాజీ జడ్పీటీసీ లంక సదయ్య, బంగారి రమేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

● ఎలిగేడు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కేక్‌కట్‌చేసి స్వీట్లు పంచారు. అర్షనపెల్లి వెంకటేశ్వరరావు, దుగ్యాల సంతోష్‌రావు, వెంకటేశ్వరరావు, నరహరి సుధాకర్‌రెడ్డి, కోరుకంటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● ఓదెల: కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ జన్మదినం వేడుకలను మడక, కొలనూర్‌తో పాటు వివిధ గ్రామాల్లో నిర్వహించారు. మడక పాఠశాలలో విద్యార్థులకు, కొలనూర్‌లో వాహనాల డ్రైవర్లకు, స్వీట్స్ పంపిణీ చేశారు. గుండేటి ఐలయ్య యాదవ్, గోషిక రాజేశం, నోముల మాధవరెడ్డి, గాజుల శివశంకర్, గోషిక కుమార్, గోషిక శ్రీనివాస్‌తో పాటు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలో చేరికకు ఎంపిక పోటీలు

ధర్మారం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే పోటీలను మండల విద్యాధికారి పోతు ప్రభాకర్ గురువారం ప్రారంభించారు. స్పోర్ట్స్ స్కూల్స్‌లో నాలువ తరగతి ప్రవేశాలకు మండలంలోని నందిమేడారం టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ బాలికల పాఠశాలలో పోటీలను నిర్వహించారు. రన్నింగ్, జంపింగ్, త్రోయింగ్ పోటీలతోపాటు ఎత్తు, బరువు కొలతలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని ఎంఈఓ తెలిపారు. ఈ పోటీల నిర్వహణలో పాఠశాల ప్రిన్సిపాల్ యుగేందర లక్ష్మి, కన్వీనర్ నక్క శ్రీనివాస్, ఫిజికల్ ఎడ్యూకేషన్ టీచర్స్ టి.సౌజన్య, పి.మమత, డి.గౌతమ్, బి.కొమురయ్య, టి.కుమార్, ఎస్.నర్మదా, భాగ్యలక్ష్మి, పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో ఎంఈవో, పీఈటీలు

మంథని, (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని స్పోర్ట్స్ స్కూల్స్‌లో ప్రవేశాలకు మండల స్థాయి పోటీలు స్థానిక కళాశాల గ్రౌండ్‌లో గురువారం జరిగాయి. హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్‌లోని స్పోర్ట్స్ స్కూల్స్‌లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఈపోటీలను పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ ప్రారంభించారు. పోటీల్లో విద్యార్థుల నైపుణ్యాన్ని బట్టి ఈనెల 25, 26 తేదీల్లో జరిగే జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంఈవో లక్ష్మి, హెచ్‌ఎం సురేష్‌కుమార్, మండల కో-ఆర్డినేటర్ కొమురోజు శ్రీనివాస్, పీడీ దొమ్మటి రవి, అవధానుల మాధురి, సమ్మయ్య, సీఆర్‌పీలు మల్లన్న, సుప్రజ, రాధిక, స్వప్నలు పాల్గొన్నారు.

నేషనల్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

కోల్‌సిటీటౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఈఎంఎస్ నేషనల్ ఒలింపియాడ్ ప్రతిభా పరీక్షలో గీతాంజలి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు మొగురం వైష్ణవి, ఇల్లందుల రాగమాలిక, బూడిద లాస్య, గాజుల స్ఫూర్తి, ఆరేపల్లి సాత్విక్ ప్రతిభ కనపర్చారు. మొగురం వైష్ణవి జాతీయ స్థాయిలో రెండో ర్యాంక్, రాగమాలిక రాష్ట్ర స్థాయిలో మొదటిర్యాంక్, లాస్య 6వ ర్యాంక్, స్ఫూర్తి జోన్‌ల్‌లో 5వ ర్యాంక్, సాత్విక్ జోనల్ 3వ ర్యాంక్‌లను సాధించినట్లు ఎస్‌ఈఎంఎస్ నేషనల్ ఒలింపియాడ్ కన్వీనర్ అరుకాల రాంచంద్రారెడ్డి ప్రకటించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు ర్యాంక్‌లు సాధించడంపై కరస్పాండెంట్ కంది రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఖనిలో అమ్మ మాట-అంగన్‌వాడీ బాట



అంగన్‌వాడీ కేంద్రాల బడిబాట

కోల్‌సిటీటౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అమ్మమాట-అంగన్‌వాడీ బడి బాట కార్యక్రమంలో భాగంగా గురువారం జనగామ-1 సెంటర్‌లో బడి బాట, అక్షరాభ్యాసాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ సరస్వతి హాజరై ర్యాలీని ప్రారంభించారు. 3సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడి కేంద్రానికి పంపించాలని తల్లిదండ్రులను కోరారు. అనంతరం కిచెన్ గార్డెన్ కార్యక్రమం చేశారు. టీచర్లు, ఆయాలు ఎస్.రజిత, పి.రమాదేవి, విజయలక్ష్మి, రజిత, రాజమణి, అనిత, పద్మ, చిన్నారులు, పోషకులు పాల్గొన్నారు.

బీజేపీ సంక్షేమ పథకాల పై అవగాహన

మంథని, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజల సంక్షేమ, అభివృద్ధి పథకాల పై బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు సబ్బని సంతోష్ ఆధ్వర్యంలో బోయినిపేటలో సంకల్ప సభ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పలు సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. బీజేపీ నేతలు బోగోజు శ్రీనివాస్, కొండపాక సత్యప్రకాష్, వొజ్జల మురళీకృష్ణ, శ్రీనివాస్, కనుకరాజులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో పదకొండేళ్ళ నరేంద్రమోదీ పాలనలో దేశ వైభవాన్ని విశ్వవేదికపై నిలిపారని బీజేపీ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ అన్నారు. కనుకులలో గురువారం వికసిత్ భారత్ రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. మోదీ పాలన దేశ ప్రజలకు అమృత కాలమని, సేవ సుపరిపాలన, పీడిత ప్రజల సంక్షేమం కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కొమ్మిడి కుమార్ రెడ్డి, వడ్లకొండ శశివర్ధన్, కొమ్మిడి రాజేందర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కొల్లూరి సంతోష్, నాయకులు సమ్మిరెడ్డి,రమేష్ పాల్గొన్నారు.

పన్నూరులో క్షుద్రపూజలు

రామగిరి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పన్నూరు గ్రామంలో క్షుద్రపూజలతో గ్రామస్థులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. మూడు ప్రధాన రహదారి కూడల్లో నిమ్మకాలు, పసుపు, కుంకుమలు, ఎరుపు, నలుపు దుస్తులు దర్శనం ఇస్తున్నాయి. నిత్యం జరుగుతున్న ఈ తంతుతో ఉదయం ఎవరి ఇంటి ముందు ప్రత్యక్షం అవుతాయోనని ఆందోళన చెందుతున్నారు.

ఓసీపీ-2 ప్రాజెక్టులో టెండర్‌ను ఏర్పాటు చేయాలి



ప్రాజెక్టు అధికారికి వినతి పత్రం అందిస్తున్న వెంకన్న

రామగిరి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసిపి-2లో టెక్నికల్ వర్క్స్ ఎలక్ట్రిషన్, ఫిట్టర్ టెండర్ కాలపరిమితి ముగిసిందని, తిరిగి టెండర్‌ను ఇప్పించాలని ప్రాజెక్టు అధికారి వెంకటరమణకు గురువారం ఐఎఫ్‌టీయు నాయకుడు ఆకుల వెంకన్న ఆధ్వర్యంలో కాంట్రాక్టు కార్మికులు వినతి పత్రం అందజేశారు. అజయ్ శ్రావణ్‌కుమార్, రవితేజ, శ్రీకాంత్, అజిత్, రాజేష్, కళ్యాణ్, సాయి, ప్రవీణ్ పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

మంథని, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల జేఏసీ గురువారం పిలుపునిచ్చారు. మూడోసారి ప్రజా వ్యతిరేక విధా నాలకు నిరసనగా జరిగే దేశ వ్యాప్త సమ్మెలో అందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జేఏసీ నేతలు బూడిద గణేష్, ముత్యంరావు, రాజేందర్, ఆకుల వెంకన్నలు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణకు సమర్థవంతమైన చర్యలు

కోల్‌సిటీ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థలో పారిశుధ్య నిర్వహణకు సమర్థవంతమైన చర్యలు చేపడుతున్నట్టు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ చెప్పారు. గురువారం రూ.30 లక్షలతో కొనుగోలు చేసిన మినీ ఎక్స్‌కావేటర్‌ను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన యంత్రాలను ఉపయోగిస్తూ ప్రజలకు మెరుగైన సేవలను అందించనున్నట్టు చెప్పారు. చైన్ మిషన్ జేసీబీతో ఓపెన్ డ్రైన్లను త్వరితగతిన శుభ్రపరచడం, మానవ శ్రమను తగ్గించడం, నగర పరిశుభ్రతను నెంబర్‌వన్‌స్థానంలో నిలిపి నగర పౌరుల ఆరోగ్య పరిరక్షణకు పెద్ద పీట వేయనున్నట్టు తెలిపారు. కమిషనర్ అరుణశ్రీ, డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, ఈఈ రామన్, పబ్బాల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు మహంకాళ స్వామి, దీటి బాలరాజు, దాసరి సాంబమూర్తి పాల్గొన్నారు.



ఎక్స్‌కావేటర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు...

గోదావరిఖని పట్టణంలో విద్యుత్ సమస్యలు రాకుండా పకడ్బందీగా చర్యలు చేపడుతున్నట్టు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శారదానగర్, రాంమందిర్ ఏరియాల్లో రూ.2.4కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 8మెగావాట్ల సామర్థ్యం గల ఈ ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రజలకు నిరంతరం విద్యుత్ సరఫరా అందుబాటులోకి వస్తుందన్నారు. గృహ అవసరాలకు, పరిశ్రమలకు తోడ్పడుతుందన్నారు. ట్రాన్స్‌కో డీఈ ప్రభాకర్, ఏడీఈ వెంకటేశ్వర్లుతో పాటు ఏఈలు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో బర్త్‌డేపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కాల్వశ్రీరాంపూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశం మందిరాన్ని రాజకీయ వేదిక చేశారని బీఆర్‌ఎస్ నాయకులు గురువారం కలెక్టర్ కోయ శ్రీహర్ష కు వినతి పత్రం అందజేశారు. పంచాయతీరాజ్ ఏఈ జగదీష్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు నిర్వహించారని, ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా జన్మదిన వేడుకలు నిర్వహించడంతోపాటు ఎంపీడీవో పూర్ణచందర్ మాట్లాడుతూ సారయ్య గౌడ్ జడ్పీటీసీగా గెలిపించుకోవాలని మాట్లాడారని కలెక్టర్‌కు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. మాజీ ఎంపీపీ నూనేటి సంపత్, మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచులు బైరం రమేష్, నాగార్జున రావు, నిదానపురం దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

త్రీడీ ప్రింటింగ్ పై విద్యార్థులకు అవగాహన

మంథని, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథాన్ని, సాంకేతిక అవగాహనను పెంపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రయోజిత డ్రీమ్.స్టార్ట్‌రైజ్‌లో భాగంగా జెడ్పీహెచ్‌ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో త్రీడీ ప్రింటింగ్ పై ఇన్నోవేషన్ ప్రొగ్రాంను నిర్వాహకులు రాకేష్ బృందం గురువారం నిర్వహించారు. పాఠశాలలోని 30 మంది విద్యార్థులు, ముగ్గురు టీచర్లకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోతారంలో ఉచిత వైద్య శిబిరం

మంథనిరూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పోతారంలో ఎడ్ల వెంకటమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కరీంనగర్‌కు చెందిన మెడికవర్, పటేల్ ఐకేర్ ఆసుపత్రుల సహకారంతో ఉచిత రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ట్రస్టు చైర్మన్ ఎడ్ల శ్రీనివాస్ మందులు పంపిణీ చేశారు. చారిటీ సభ్యులు బండారి సమ్మయ్య, ఆదిత్య, సుమంత్, నరేందర్, ఆసుపత్రి సిబ్బంది బుద్ధార్తి సతీష్, గుర్ర కిరణ్, శ్రీనివాస్, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి

కాల్వ శ్రీరాంపూర్ జూన్ 19 (ఆంధ్రజ్యోతి! మండల కేంద్రంలోని కేజీబీవీ స్కూల్‌లో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్య సిబ్బంది అంతర్జాతీయ యోగా కార్యక్రమం గురువారం జరిగింది. ఆయుష్ డాక్టర్ నిహారిక బాలికలకు యోగాపై అవగాహన కల్పించారు.

రామాలయ అభివృద్ధికి విరాళం

ఓదెల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సీతారామ స్వామి ఆలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన రామంచ రాజమ్మ స్మారకార్థం ఆమె కుమారుడు అనిల్ లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. మాజీ ప్రజాప్రతినిధుల సమక్షంలో కార్యనిర్వాహణ కమిటీకి అందజేశారు. రామచంద్రం, రేగుల రాజేశం, మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, శంకర్, తీర్థాల కుమార్, గోపతి ఎల్లయ్య, మాజీ సర్పంచ్ రాచర్ల రాజేశం, మల్లేశం, వెంకటేశం, రెడ్డి సదానందం, పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

జ్యోతినగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను కార్మిక లోకం విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు కోరారు. గురువారం ఎన్టీపీసీ పీటీఎస్‌లోని గుర్తింపు సంఘం మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఐఎన్‌టియుసి జాతీయ కార్యదర్శి బాబర్ సలీంపాషా, సీఐటీయు నాయకులు నాంసాని శంకర్, ఐఎఫ్‌టియు నాయకుడు చిలుక శంకర్, ఎఐటియుసి నాయకుడు రెడపాక లక్ష్మణ్, భూమయ్య, కృష్ణారెడ్డి, నాగభూషణం మాట్లాడారు. కేంద్రంలోని మోదీ సర్కారు కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నదన్నారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్పు చేస్తోందన్నారు. లేబర్ కోడ్ల వల్ల కార్మికులు సమ్మె హక్కు కోల్పోతారని, 8 గంటల పని విధానం పోయి 12 గంటల పని విధానం వస్తుందన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తున్నదని తెలిపారు. లాభాల్లో ఉన్న పీఎస్‌యూలను కేంద్రం డిజిన్వెస్ట్‌మెంట్ పేరుతో ప్రైవేటు వ్యాపారులకు అప్పగిస్తున్నదన్నారు. ఈనెల 23న జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె నోటీసులు యాజమాన్యాలకు అందజేస్తామన్నారు. పారిశ్రామిక ప్రాంతంలోని కార్మికులు, ప్రజలు, వ్యాపార వర్గాలు సమ్మెకు మద్దతునివ్వాలని కోరారు. చందర్, విజయ్ మోహన్, లక్ష్మారెడ్డి, రాజేశ్వర్, వేముల కృష్ణయ్య, పాల్గొన్నారు.

కనీస వేతనాల జీవోల అమలుకు కృషిచేయాలి

కనీస వేతనాల జీవోలను మంత్రి వివేక్ అమలు చేయించేలా చొరవ చూపాలని ఐఎన్‌టియుసి జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీం పాషా అన్నారు. విలేకరుల సమావేశంలో బాబర్ మాట్లాడారు. కనీస వేతనాల జీవోలు అమలు కాకపోవడంతో కార్మికులు చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశ్రామిక ప్రాంతంలో ఈఎస్‌ఐ ఆసుపత్రి, కాంట్రాక్టు కార్మికుల కోసం బీ కేటగిరిగా మార్చేందుకు మంత్రి వివేక్ చొరవ చూపాలన్నారు. 1990 దశకంలో తీవ్రమైన నష్టాలతో బీఐఎఫ్ఆర్ పరిధిలోకి వెళ్లిన సింగరేణి సంస్థను వెంకటస్వామి కాపాడాడని తెలిపారు. వివేక్ ఎంపీగా ఉన్న సమయంలో రామగుండం ఎరువుల కార్మాగారం పునరుద్ధరణకు కృషి చేశారన్నారు. రాష్ట్ర కార్మిక శాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వివేక్‌పై పారిశ్రామిక ప్రాంత కార్మికులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని అన్నారు. రాజేశ్వర్, కృష్ణయ్య, గోపాల్‌రావు, చందర్, విజయ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులను ఆదుకోరూ...!

(5వ పేజీ తరువాయి)

యాసంగి సీజన్ నుంచి రైతుభరోసా పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. ఒక్కో పంటకు ఎకరానికి 7,500 రూపాయల చొప్పున కాకుండా 6 వేలు ఇచ్చారు. అది కూడా 3 ఎకరాల వరకు మాత్రమే భూములు కలిగిన రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించింది. ఈ వానాకాలం సీజన్‌లో పూర్తి స్థాయిలో రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించింది. సోమవారం సాయంత్రం నుంచి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయి. కానీ ప్రభుత్వం కౌలు రైతుల ప్రస్తావన తీయడం లేదు. సన్న ధాన్యం పండించే రైతులకు గత వానాకాలం సీజన్ నుంచి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇస్తున్నది. దీంతో సన్న ధాన్యం పండించిన కౌలు రైతులకు బోనస్ రూపంలో కొంత మేలు జరిగినప్పటికీ, పట్టాదారులు కొందరు ఆ బోనస్‌లో తమకు సగం కోరుతుండగా, ఇంకొందరు కౌలు ధరలను పెంచారని రైతులు చెబుతున్నారు. రెండు పంటలు పండే వరి పొలాలకు ఎకరానికి ఒక్కో పంటకు 10 నుంచి 12 వేలు తీసుకుంటున్నారని, వర్షాధారంగా సాగయ్యే పత్తి పంటకు ఏడాదికి ఎకరానికి 12 వేల నుంచి 18 వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నారని తెలిపారు. యాసంగి సీజన్ బోనస్ డబ్బులు విడుదల కాలేదు. కౌలు రైతులను గుర్తించేందుకు ఇప్పటి వరకు ప్రభుత్వం ఎలాంటి మార్గదర్శకాలను రూపొందించ లేదు. దీంతో ప్రభుత్వం తమకు పెట్టుబడి సాయాన్ని అందిస్తుందా, లేదా అని కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు. బోనస్‌తో సంబంధం లేకుండా పట్టాదారులకు ఇచ్చినట్లుగానే తమకు కూడా రైతుభరోసా పథకం కింద పెట్టుబడి సాయాన్ని అందించాలని కౌలు రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

రూ.కోటి 22 లక్షల రైతు భరోసా చెల్లింపు

జ్యోతినగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రామగుండం మండలంలో ఇప్పటి వరకు కోటి 22 లక్షల రూపాయల రైతు భరోసా సొమ్ము చెల్లించామని మండల వ్యవసాయ అధికారి కె.ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 1747 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో మొత్తాన్ని జమ చేశామని తెలిపారు. తదుపరి విడతలో 68 మంది రైతులకు 26 లక్షల రూపాయలు జమ చేస్తామని పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

కోల్‌సిటీటౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షించడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని బీజేపీ రామగుండం ఇంచార్జీ కందుల సంధ్యారాణి అన్నారు. అడ్డగుంటపల్లి లక్ష్మీనగర్‌లో సిలారపు కళ్యాణ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టగా సంధ్యారాణి హాజరై మొక్కలు నాటారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన ఏక్ పేడ్ మా కేనామ్ కార్యక్రమం అమ్మ పట్ల ప్రేమను, ప్రకృతి పట్ల బాధ్యతను వ్యక్తపరిచే అద్భుతమైన ఆలోచన అని పేర్కొన్నారు. ముస్కుల భాస్కర్‌రెడ్డి, కోడూరి రమేష్, పిడుగు కృష్ణ, అపర్ణ, రమేష్, మురళి, విష్ణువర్ధన్‌రెడ్డి, అందె రాజ్‌కుమార్, దాసరి సుమలత, పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే సదస్సులు



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్

మంథని, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం భూసమస్యల పరిష్కారానికి గ్రామాల్లో భూభారతి ద్వారా రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేస్తుందని పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం అవరణలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మాట్లాడుతూ.. ఇప్పటి వరకు భూ సమస్యలతో ఇబ్బందులు పడ్డ వారు అధికారుల దృష్టికి తీసుకు వస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. పలువురు తమ సమస్యలపై దరఖాస్తులు ఇచ్చారు. తహసీల్దార్ కుమారస్వామి, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ వితరణ

ధర్మారం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలలో చదివే విద్యార్థులకు నోట్ బుక్స్‌ను మాజీ సర్పంచ్ బద్దం సుజాత అందజేశారు. విద్యాశాఖ పాత స్ట్రెంత్ ప్రకారం నోట్ బుక్స్ అందజేయగా, నూతనంగా చేరిన విద్యార్థులకు నోట్ బుక్స్ సరిపోవడం లేదని హెచ్‌ఎం నూతి మల్లన్న సుజాత దృష్టికి తీసుకెళ్ళారు. దీంతో 6 వేల రూపాయల విలువ గల నోట్ బుక్స్‌ను గురువారం పాఠశాలలో అందజేశారు. ఉపాధ్యాయ బృందం సుజాతను సన్మానించారు. ఉపాధ్యాయులు గండ్రాతి శ్రీలత, అనుముల శారద, సిరిపురం సునీల్, పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

సుల్తానాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థులు కొందరు దీన స్థితిలో ఉండడంతో వారి మిత్రులంతా కలసి కొంత నగదును వారికి అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. 1980 - 81 బ్యాచ్ పదవ తరగతికి చెందిన పూర్వ విద్యార్థులలో నరహరి వెంకటేశ్వర్లు, ఎండీ మీరాహుస్సెన్, రఫీయోద్దీన్‌లు ఆర్థిక పరిస్థితి బాగా లేదు. తోటి మిత్రులు కలసి గురువారం తలా ఐదు వేల రూపాయల నగదును అందించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, కొల్లూరి అశోక్ కుమార్, రవీందర్, ఏక్యూ నసీరొద్దిన్, డి ప్రకాష్, కొమురవెల్లి అంజయ్య, బర్కం రమేష్, దన్నాయక్ శ్రీనివాస రావు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరు చేయాలి



వాల్ రైటింగ్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి

కోల్‌సిటీ, జూన్19 (ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్‌లో పారిశుధ్య నిర్వహణను మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి అన్నారు. వంద రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నగర అభివృద్ధిపై వాల్ రైటింగ్‌ను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇండ్ల వద్ద ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనానికి అందించాలని, చెత్త రీసైక్లింగ్, ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి చిత్రాలను వేయించామన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్, వార్డు అధికారులు, జవాన్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సీపీఐ పోరాటం

కళ్యాణ్‌నగర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై పోరాటం చేసేది సీపీఐ అని ఆ పార్టీ నగర కార్యదర్శి కే కనకరాజు అన్నారు. గురువారం గాంధీనగర్‌లో జరిగిన సీపీఐ మహాసభలో మాట్లాడుతూ కార్మికులు, కర్షకులు, రైతుల కోసం పోరాటంలో ముందుండేది సీపీఐ అని, స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలిచేందుకు ఎర్ర సైనికులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మోహన్, తాళ్లపల్లి మల్లయ్య, ఓదమ్మ, రేణికుంట్ల ప్రీతం, తాళ్లపల్లి శ్రీనివాస్, రామకృష్ణ, రాజయ్య పాల్గొన్నారు.